మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



## ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి..

**- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి - జెడ్పీ రెండో స్థాయి సంఘం సమావేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలపై గ్రామీణ స్థాయిలోనూ ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో నిర్వహించిన రెండో స్థాయి సంఘం సమావేశంలో గ్రామీణ అభివృద్ధిపై కోయిలకొండ జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కార్మికులకు కల్పించిన రూ.5లక్షల బీమా, నూలుపై సబ్సిడీ ఇతర రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు చేనేత జౌళి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పథకం ద్వారా యువతకు పరిశ్రమల ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఈజీఎస్ ద్వారా అడిగిన వారికి ఉపాధా పనులు కల్పించాలన్నారు. గిరి వికాసంలో వేయించిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తే బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

## కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ

**- ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు**

**- రూ.500కే గ్యాస్ సిలిండర్ - మాజీమంత్రి జి.చిన్నారెడ్డి**

**పెద్దమందడి, జూలై14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీచేస్తామని, ఇంటినిర్మాణంకోసం రూ5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు ఇస్తామని మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి అన్నారు. గురువారం పెద్దమందడి మండలపరిధిలోని వీరాయిపల్లి, దొడగుంటపల్లి, మంగంపల్లి జంగమాయపల్లి, బలిజపల్లి, ఎర్రగడ్డ తాండ, కన్మనూరుతోపాటు ఆయాగ్రామాలలోనూతన గ్రామ కమిటీ కార్యక్రమానికి మాజీమంత్రి చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి సత్యారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న ఆధ్వర్యంలో వీరాయిపల్లి గ్రామంలో నూతన గ్రామకమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చిన్నారెడ్డి మాట్లాడుతూ.... రూ.500కే గ్యాస్‌సిలిండర్ అందజేస్తామని, ఒంటరి మహిళలకు, వితంతువులకు, వృద్ధులకు వికలాంగులకు రూ.4వేలు పింఛన్ ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిరుపేదలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, గ్రామ కమిటీలు వివిధ విభాగాలలో ఎన్నికైన ప్రతి ఒక్క నాయకుడు , కార్యకర్త శక్తివంచన లేకుండా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మోజర్ల మన్యం, ఓబీసీ మండల అధ్యక్షుడు రఘు, టౌన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎల్లన్న, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు, మెంటేపల్లి రాములు, విజయవర్ధన్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ దివాకర్ యాదవ్, రామ్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, భాస్కర్, వనపర్తి కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

## ఓటర్ నమోదు ధరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలి...

**-వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 14 ప్రభాతవార్త:** ఓటర్ జాబితాలో నూతనంగా ఓటర్ నమోదుకు వచ్చిన ధరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూడాలని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ జాబితాపై కలెక్టర్లతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న యువత ఆన్‌లైన్ ద్వారా కానీ ఫారం-6 ద్వారా కానీ ధరఖాస్తు చేసుకునేందుకు జూలై 15 చివరి తేదీగా ప్రకటించడం జరిగిందన్నారు. జూలై 15 నాటిక వచ్చిన అన్ని ధరఖాస్తులను బూత్ లెవల్ అధికారులు గడప గడపకు తిరిగి పరిశీలన అనంతరం అర్హత కలిగిన ధరఖాస్తులను జూలై 27లోపు పరిష్కరించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌళిక వసతులు, సరైన వెలుతూరు, తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంప్, విద్యుత్ కనెక్షన్, ఫర్నిచర్ ఉండే విధంగా చూసుకొని అవసరమైన వాటికి మరమ్మత్తులు చేయించాలని సూచించారు. నూతన ఓటర్ల నమోదుపై యువతకు గ్రామ స్థాయిలో, మున్సిపాలిటిలో ప్రచారం చేయాలని సూచించారు. ఈవీఎం ఈ విధంగా పనిచేస్తుంది, వాటి ఖచ్చితత్వమైన పనితనంపై నియోజకవర్గ స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ కంట్రోల్ యూనిట్ల ప్రదర్శన చేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ కేంద్రాలను గుర్తించాలని తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ మృతి చెందిన ఓటర్లు, డుప్లికేట్ ఓటర్ల తొలగింపు నిమిత్తం నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాలు పూర్తయ్యాయని, కొల్లాపూర్ నియోజకవర్గంలో పరిశీలనలో కొనసాగుతుందన్నారు. కొత్త ఓటర్ల నమోదు కొరకు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. ఒకే ఇంటి నెంబరుపై 6 అంతకన్న ఎక్కువ ఓట్లు నమోదైన వాటికి బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికి తిరిగి సర్వే చేయడం పూర్తి అయిందన్నారు. పొరపాటున డిలీట్ అయిన ఓటర్ల నుంచి ఫారం-6 తీసుకోవడం జరుగుతుందన్నారు. జూలై 15వరకు వచ్చే అన్ని దరఖాస్తులను ఇంటింటి సర్వే చేయించి జూలై 27లోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్

## మణిపూర్‌లో హింసను అరికట్టాలి..

**- మహబూబ్‌గర్ జిల్లా కేంద్రంలో క్రైస్తవుల శాంతియుత భారీ ర్యాలీ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త :** మణిపూర్‌లో క్రైస్తవులు, చర్చిల కూల్చివేతకు నిరసనగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో క్రైస్తవులు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చి, , పాస్టర్స్ అసోసియేషన్, స్థానిక వివిధ చర్చిలతోపాటు ఉమ్మడి జిల్లా పాస్టర్లు, నాయకులు, క్రైస్తవులు కలిసి శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో హింసను కేంద్రం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం తక్షణమే స్పందించి దాడులను అరికట్టాలని, మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనేలా కృషి చేయాలని కోరారు. మణిపూర్‌లో క్రైస్తవులపై అరాచకాలు నశించాలని, సేవ్ మణిపూర్ అంటూ, మణిపూర్‌లో ప్రజాస్వామ్యం, మతసామరస్యం కాపాడాలంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి న్యూటౌన్ మీదుగా శాంతియుత మౌన ప్రదర్శన భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌరస్తా వద్ద మౌన ప్రదర్శన నిర్వహించారు. శాంతియుత ర్యాలీలో వందలాదిగా క్రైస్తవులతోపాటు పాస్టర్లు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న క్రైస్తవులు



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

## పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు

**నారాయణపేట ప్రతినిధి, జూలై 14 ప్రభాతవార్త :** శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు డీఎస్పీ కె. సత్యనారాయణ, ఎస్సై సురేష్‌లు జాజాపూర్ శివారులోని అప్పక్‌పల్లి గ్రామంలో నూతన రూరల్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని, నాణ్యతతో కట్టాలని, కాంట్రాక్టర్ అధికారులను ఆదేశించారు. రూరల్ పోలీస్ స్టేషన్ నూతన బిల్డింగ్ పూర్తయ్యే వరకు ప్రైవేట్ భవనంలో నూతన రూరల్ పోలీస్ స్టేషన్ త్వరలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.



నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీలు

## నులి పేద్దాం..!




నులిపురుగులు వల్ల పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రక్తహీనత, పోషకాహార లోపం బారిన పడుతారు. దీంతో ఆకలిమందగించడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, అతిసారం, మలంలో రక్తం, వ్యాధి నిరోధక శక్తి గ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. నులిపురుగుల నివారణనకు సర్కార్ చర్యలు తీసుకుంటున్నది. ఈనెల20న నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా 19ఏండ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు ఆరోగ్య శాఖ అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. - మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త

- నులిపురుగుల వల్ల అనారోగ్యం
- ఈనెల 20న నులిపురుగు నివారణ దినోత్సవం
- 19ఏండ్ల లోపు వారికి మాత్రలు పంపిణీ
- మహబూబ్‌నగర్ జిల్లాలో 2.28లక్షల మంది గుర్తింపు
- సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం

**నులిపురుగులు రకాలు..** నులిపురుగులు ఐదు రకాలుగా ఉంటాయి. వాటిలో కొంకిలిపురుగులు, ఏలికపాములు, బద్దెపురుగు, నులిపురుగు, విప్‌వామ్స్ ఉంటాయి. ఇవి సుమారుగా 17మీటర్లు (55అడుగులు) పొడువు ఉంటాయి. 25ఏండ్ల వరకు బతుకుతాయి. వీటి గుడ్లు మట్టిలో 10ఏండ్లకు వరకు జీవిస్తాయి. సరిగ్గా ఉడికించని మాంసాహారాలతో పురుగులు కడుపులోకి చేరుతాయి. పిల్లలు మట్టిలో ఆడడం వల్ల పాదాలా ద్వారా లార్వాల ద్వారా శరీరంలోకి చేరుతాయి. నులిపురుగుల వల్ల పిల్లల శారీరక ఎదుగుదల శక్తి ఆగిపోతుంది. దీంతో పిల్లలు బక్కచిక్కినట్లు కనిపిస్తారు.





నులిపురుగుల నివారణ దినోత్సవం గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..** బహిరంగ ప్రదేశాలలో మలవి సర్జన చేయకుండా మరుగుదొడ్లు ఉపయోగించాలి.

- పిల్లలు తప్పనిసరిగా చెప్పులు ధరించేలా చూసుకోవాలి
- గోళ్లను శుభ్రంగా కత్తిరించుకోవాలి
- ఆహారంపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- ఆహారం విషయంలో బాగా ఉడికించినవే తీసుకోవాలి.

-ఎప్పటికప్పుడు వేడి ఆహారాన్ని భుజించాలి

**మాత్రలు ఎలా వేసుకోవాలి..**

1-2సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర నీళ్లలో కలిపి తాగించాలి. 2-3 ఏండ్లలోపు పిల్లలకు1 మాత్రను నులిపి నీళ్లలో కలిపి తాగించాలి. 3నుంచి 19 ఏండ్లలోపు వయస్సున్న అందరికీ ఒక మాత్రను నమిలి మింగించాలి. మాత్రను ఎట్టి పరిస్థితుల్లో పరిగడుపున వేయించొద్దు. తిన్న తర్వాతనే వేయించాలి. ఇది నేరుగా మింగే మాత్ర కాదు.. వీటిని చప్పరించాలి. లేదా నీటిలో కలిపి వేయించాలి. మహబూబ్‌నగర్ జిల్లాలో 19ఏండ్లలోపు 2లక్షల78వేల 500మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి రవినాయక్ ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు మండల ప్రత్యేకాధి కారులు, మండల స్థాయి అధికారులు ఇతర సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈనెల20 నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వందశాతం మాత్రలు వేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 20న ఏదైనా కారణం చేత మాత్రలు వేయని పిల్లలకు 27 నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో మాత్రలు తప్పనిసరి వేయించాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ విషయంలో మరోసారి ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి ఏఎన్ఎం, హెల్త్ వర్కర్లు సమక్షంలో టాబెట్లు వేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

**మాత్రలు తప్పనిసరి వేయించాలి..**



1-19 ఏండ్లలోపు పిల్లలు మాత్రలు తప్పని వేయించాలి. జిల్లాకు 3లక్షల 55వేల400 మాత్రలు వచ్చాయి. నులిపురుగులను నివారిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారు. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. మాత్రలు సక్రమంగా వేయించే బాధ్యత వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర జిల్లా, మండల అధికారుల సమన్వయంతో వందశాతం విజయవంతం చేయాలి.

– జి రవినాయక్, కలెక్టర్, మహబూబ్‌నగర్

## యథేచ్ఛగా ఇసుక అక్రమరవాణ..!

- అంతా తానే కర్ణాటకకు ఇసుకను పంపుతున్న మైనింగ్ అధికారి..?
- పట్టుకున్న ఇసుక టిప్పర్లను వదులుతారా కేసు నమోదు చేస్తారా..?

**కృష్ణ, జూలై 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా, మక్తల్ నియోజకవర్గం మాగనూరు మండలం నుండి కర్ణాటక ప్రాంతానికి ఇసుక రవాణా యథేచ్ఛగా అక్రమంగా కొనసాగుతూ ఉంది. వివరాల్లోకి వెళ్తే మాగనూరు మండల కేంద్రంలో ఒక రీచ్ వర్కూర్ గ్రామంలో పలు రీచ్‌ల నుంచి ఇసుక తరలించడం కొరకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇది అదనుగా భావించిన రీచ్ యజమానులు మైనింగ్ అధికారితో కుమ్మక్కై కర్ణాటకకు అక్రమ మార్గంలో ఇసుకను రవాణా చేయాలని వక్రబుద్ధితో గతకొన్ని రోజులుగా కర్ణాటక సరిహద్దులో ఉన్న గ్రామాల పేరుమీద ఇసుక అనుమతితో అనుమతి పొంది అక్కడి నుంచి కర్ణాటక ప్రాంతంలో నిర్మిస్తున్న ఇండస్ట్రియల్‌కు పెద్ద ఎత్తున దాదాపు 5 టిప్పర్ల ఇసుక అవసరం ఉందని గుర్తించి జిల్లా అధికారి వారితో కుమ్మక్కై ఇక్కడి నుండి యదేచ్ఛగా అక్రమ మార్గంలో ఇసుకను తరలిస్తున్నారు. గత వారం రోజుల క్రితం స్థానికంగా కొంతమంది వాహనాలను ఆపి పోలీసులకు సమాచారం ఇచ్చినా కూడా వారు స్పందించలేదు. మీడియాలో వచ్చినా కూడా జిల్లా కలెక్టర్ అధికారులు స్పందించలేదు అనే ఆరోపణలు ఉన్నాయి. అయితే నేడు కర్ణాటకకు తరలిస్తున్న ఇసుక టిప్పర్లను కొంతమంది యువకులు సరిహద్దు ప్రాంతంలో ఆపి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చాలా సమయం తర్వాత ఇక్కడికి చేరుకుని మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో కొంతమంది ఓ ప్రజాప్రతినిధి ఆ పోలీస్ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి స్టేషన్‌కు తరలించకుండా బయటనే ఆపి రాజీ కుదిర్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం మరి అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్లను స్టేషన్‌లో ఉంచి కేసులు నమోదు చేస్తారా లేక వదిలేస్తారా అని ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనం



స్టేషన్ బయట నిలిపిన ఇసుక టిప్పర్లు

## స్థాయిని మించి విమర్శలు చేస్తున్న గువ్వల..

- కోమటిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తారా.?
- 24 గంటల ఉచిత విద్యుత్ నిరూపిస్తావా.
- ఓటమి భయంతోనే దుష్ప్రచారం
- డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, జూలై 14 ప్రభాతవార్త:**9 ఏళ్ల పాలనలో కల్లబొల్లి మాటలతో ప్రజలను, రైతులను ఆగం పట్టిస్తూ ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా దగా కోరి మాటలతో తెలంగాణ రాష్ట్రాన్ని దౌర్భగ్య స్థితికి తీసుకొచ్చి ఓటమి భయంతో మాటలను వక్రీకరించి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి నీదా అని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హితవు పలికారు. శుక్రవారం అచ్చంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు గద్దెనెక్కేందుకు అంతు చిక్కని హామీలను గుప్పిస్తూ మాయమాటలతో ప్రజలను డబ్బులతో ప్రలోభాలకు గురి చేస్తూ లొంగకపోతే అధికార దాహంతో బెదిరింపులకు పాల్పడుతూ మూడోసారి గద్దెనెక్కేందుకు కుట్రలు పన్నుతుంటే తిరస్కరిస్తున్నారనే విషయాన్ని గ్రహించిన బీఆర్ఎస్ నాయకులు, ప్రతిపక్ష నాయకుల మాటలను వక్రీకరించి ప్రజలకు చేరువయ్యేలా కుట్రలు పన్నుతున్నారు కానీ రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకడమే తప్ప 9 సంవత్సరాల పాలనలో ఎక్కడ ఇచ్చారని, నిరూపిస్తారా అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తారా అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 24 గంటల విద్యుత్‌ను అందిస్తామని నిరూపిస్తే రాజీనామా చేస్తానని ప్రకటించిన కూడా బీఆర్ఎస్ నాయకులు సవాల్‌ను స్వీకరించడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత అభివృద్ధే ధ్యేయంగా మెనిఫెస్టో సిద్ధమవుతుందని, దీనిని పసిగట్టిన బీఆర్ఎస్ నాయకులు ఉక్కిరి బిక్కిరి అయి అంతు చిక్కని పరిస్థితిలో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటుకరమన్నారు. ఉచిత విద్యుత్ సమయాన్ని తగ్గించాలనే ఆలోచన తమకు లేదని ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ హయంలోనే రైతుల అభివృద్ధి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశ పెట్టి రైతన్నకు అందుబాటులో ఉన్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్, రామనాథం, శ్రీనివాస్, గౌరి శంకర్, నర్స య్యాయాదవ్, కటకం రఘురాం, నర్సింహ్మా, శివ, గౌస్ మహబూబ్‌అలీ, వినోద్, అంజి, సోహేల్ తదితరులు ఉన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

## దేవస్థాన పున:నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

**అన్నాసాగర్‌లో 17 నుండి మూడురోజుల పాటు ఆంజనేయస్వామి ఉత్సవాలు**

**భూత్పూర్, జులై 14 ప్రభాతవార్త :** భూత్పూర్ మండలంలోని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సొంతూరు అన్నాసాగర్‌లో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పున:నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆలయ పున: నిర్మాణ పనులన్ని పరిశీలించారు. ఈనెల 17 నుండి 19 వరకు మూడ్రోజుల పాటు ఎమ్మెల్యే ఆల ఆధ్వర్యంలో ఆలయ పున: ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. 17న గణపతిపూజ, 18న అవహిత పూజలు దేవతా మూలమంత్ర పూజలు, 19న మూలవిరాట్ విగ్రహాల ప్రతిష్ట ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## ఐదుగురు సీఐల బదిలీ..


**- ఉత్తర్వులు జారీ చేసిన మల్టీజోన్-2 ఐజీ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ షన్వాజ్ ఖాసీం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. ఇందులో ఎస్ రవికుమార్ పీసీఆర్ మహబూబ్‌నగర్ నుంచి డీఎస్‌బీ-2 వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. ఎన్ అశోక్ వెయింటింగ్ ఇన్ మల్టీజోన్-2 నుంచి డీటీసీ మహబూబ్‌నగర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. జి రజితారెడ్డి భూత్పూర్ పీఎస్ నుంచి ఐజీపీ మల్టీజోన్-2కు పోస్టింగ్ ఇచ్చారు. ఎస్ రామకృష్ణ వెల్దండ సర్కిల్ నుంచి నాగర్‌కర్నూల్ నుంచి భూత్పూర్ మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. పి శ్రీకాంత్‌రెడ్డి మరికల్ సర్కిల్ నారాయణపేట నుంచి డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

## మూడు గంటల కరెంటు ఇచ్చే పార్టీ మాకొద్దు..

**ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 14 ప్రభాతవార్త :** రైతులకు 24 గంటల కరెంటు అవసరం లేదని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం మూడు గంటల కరెంటు సరిపోతుందని మాట్లాడడంపై సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు గంటలకు కరెంటు ఇస్తామనడానికన నిరసిస్తూ బాలానగర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అహ్మద్ పాషా, రాములు నాయక్ సహా కొంతమంది ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నిరంతర విద్యుత్‌తో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు.



**జడ్చర్ల మాజీ ఎంపిపి శంకర్‌నాయక్ కుటుంబానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ**

జడ్చర్ల మాజీ ఎంపిపి శంకర్‌నాయక్ మాతృమూర్తి ముత్యాలి బాయ్ గత శనివారం అనారోగ్యంతో మరణించారు. శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వారి స్వగ్రామమైన పెద్ద అదిరాల పరిధిలోని రామస్వామి గుట్ట తండాకు చేరుకుని శంకర్ నాయక్ మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మనోధైర్యం చెప్పారు.

## ముదిరాజుల అభివృద్ధికి తోడ్పడుతా...

**- ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**అచ్చంపేట, జూలై 14 ప్రభాతవార్త:**ముదిరాజ్ కులస్థుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి చేపలు, వాహనాలను అందించిందని ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం అచ్చంపేట మండలం హాజిపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ముదిరాజ్‌ల భవనానికి శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ముదిరాజ్‌లను ఆదుకోవడానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు పోకల మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు పర్వతాలు, అచ్చంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, లోక్యనాయక్, తిరుపతియాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్ తదితరులు ఉన్నారు.



## కాగితాల్లోనే నిధులు..

**- జడ్చర్ల ఉర్దూ మీడియం పాఠశాలలో బాత్‌రూం కూడా లేదు..**

**- టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు లోని ఉర్దూ మీడియం పాఠశాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. హెచ్‌ఎంను అడిగి పాఠశాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలలో చాలా సమస్యలు ఉన్నాయని, పాఠశాల అభివృద్ధికి రూ.80లక్షల నిధులు మంజూరైనా నిర్మాణానికి ఎవరూ ముందుకు రాలేదన్నారు. కాగితాలకే నిధులు పరిమితమయ్యాయని, పాఠశాలలో బాత్‌రూం లేదని, వర్షం పడితే పిల్లలు పడవలో వెళ్లాల్సిన దుస్థితి ఉంటుందన్నారు. మన ఊరు – మన బడి పేరుకే పరిమితం అయిందని, కార్యాచరణ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.



## ప్రాజెక్టులకు, నదులకు కంపెనీ వల్ల ప్రమాదం..

**నారాయణపేట ప్రతినిధి,జూలై 14 ప్రభాతవార్త :** ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని నిరవధిక రిలే ధర్నాలను 14వ రోజు కుల అసమానతల నిర్మూలనా పోరాట సమితి, నారాయణపేట జిల్లా కన్వీనర్ ఎస్. లక్ష్మయ్య ప్రారంభించారు. ఈ ధర్నాలో చిత్తనూరు వెంకటేశ్వరమ్మ, మధు,బి.వెంకటయ్య, రామచంద్రయ్య, యాదయ్య, రమేష్, శివలింగప్ప,వెంకటయ్య, నరెందర్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ రోజుకు ఆరు లక్షల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఈ కపెనీ ఒక లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి 4 లీటర్ల నీళ్లు కావాలి. అంటే రోజుకు 24 లక్షల లీటర్ల నీళ్లు కావాలి. ఇంత పెద్ద ఎత్తున నీటిని ఉపయోగిస్తే సాగు, తాగునీటి కొరత తీవ్రమై వ్యవసాయ రంగం కుదేలవుతుంది. ప్రధానంగా రామన్‌పాడు ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు, కృష్ణా నదులు కలుషితమవుతాయి. దాంతో తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో అందిస్తున్న తాగు నీళ్లన్ని కలుషితం కావడం వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశముంది. కనుక వెంటనే రాజకీయ పార్టీలు స్పందించి ఈ కంపెనీని రద్దు చేయించాలని కోరారు.



## రాజ్యాంగ నిర్మాతకు వినతి పత్రం


**భూత్పూర్,జూలై 14 ప్రభాతవార్త :** అర్హులైన దళితులందరికి దళితబంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బిజెపి) దళిత మోర్చా ఆధ్వర్యంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు శుక్రవారం భూత్పూర్ చౌరస్తాలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. పార్టీలకతీతంగా అర్హులైన దళితులకు దళితబంధు వర్తింపజేయాలని నాయకులు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు గంగాపురం రవిందర్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పులగుర్ల మల్లేష్, పట్నం శ్రీనివాస్, నర్సింహులు, సదానంద్, చెన్నయ్య, రాంరెడ్డి, రాము పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత...

**-ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**అచ్చంపేట, జూలై 14 ప్రభాతవార్త:**అచ్చంపేట మండలం గుంపెన్‌పల్లి గ్రామానికి చెందిన కేతావత్ లక్కర్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును శుక్రవారం మృతుడి భార్య పార్వతికి ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు పోకల మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు పర్వతాలు, అచ్చంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, లోక్యనాయక్, తిరుపతియాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.



## యూత్ డిక్లరేషన్ అంశాలపై అవగాహన..

**వంగూరు, జూలై 14 ప్రభాతవార్త:**వంగూరు మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో యూత్ డిక్లరేషన్‌లోని అంశాలపై ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగులకు రూ.5వేల భృతి, వరంగల్ రైతు డిక్లరేషన్ ఇందిరమ్మ రైతు భరోసా పథకం ద్వారా రైతులతో పాటు కౌలు రైతులకు రూ.15వేలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కోసం రూ.5లక్షలు, ఏకకాలంలో రైతు రుణమాఫీ హామీలు అమలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివశంకర్, నాయకులు మహేష్, పూర్య, రవి, మహేష్, రాఘవేందర్, జనార్ధన్, శ్రీశైలం, రఫి, జంగయ్య, గఫూర్, శివ, వంశీ, శ్రీకాంత్, శివ, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.




## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ

**అడ్డాకుల,జూలై14,ప్రభాతవార్త:** మండల పరిధిలోని శాగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల యువ నాయకులు భాస్కర్ గౌడ్ జన్మదిన వేడుకలను జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు యువకులతో కలిసి శాలువాతో సత్కరించి, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దూరి చంద్రమోహన్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోద జయన్న గౌడ్, మండల కో ఆప్షన్ ఖాజా గోరి, మండల యూత్ అధ్యక్షులు ఎలుసరి బాలరాజు, రాజు గౌడ్, విష్ణువర్ధన్, అడ్డాకుల టౌన్‌యూత్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, విష్ణు ,ఖలీల్ ,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగ ఉద్యమాలు బలపరచాలి..

**అమరచింత, జూలై 14, ప్రభాతవార్త:** అమరచింత మండలంలోని కొంకనివానిపల్లి గ్రామంలో రైతు సంఘం సభ్యత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకెఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమెరికా పర్యటన సందర్భంగా అనేక వ్యవసాయ ఉత్పత్తులపై సంతకాలు చేసి చిన్న సన్నకారు రైతులకు నష్టం కలిగించే వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికాకు సుంకాలు తగ్గించే పద్ధతులు ప్రధానంగా ఆపిల్, బఠానీలు ఇంకా 8 వ్యవసాయ ఉత్పత్తులపై సంతకాలు చేయడం జరిగింది. ఇది దేశంలో ఉన్న రైతన్నకి తీవ్ర నష్టం కలిగించే ఒప్పందం అని దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశం నుండి అమెరికాకు ఉక్కు , అల్యూమినియం ఎగుమతులు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. కావునా ప్రతిగా అంగీకరిస్తున్నట్లు తెలుస్తుంది కావునా దేశంలో ఉన్న రైతన్నకి ప్రతి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతు ఆత్మహత్యలు ఆపాలని పార్లమెంట్‌లో రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెరిగిన టమాటా ధరలు తగ్గించి ప్రజలపై భారాలు ఆపాలని డిమాండ్ చేశారు. వానాకాలం ఖరీఫ్‌లో వానలు రాక వేసిన గింజలు ఎండిపోవడంతో రైతులకు తీవ్ర నష్ట కలిగిందని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోహన్,మహేష్, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి..

**- సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

**- తొమ్మిదో రోజుకు చేరిన గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త :** పంచాయతీ కార్మిలకులను రెగ్యులరైజ్ చేయాలని, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వివిధ డిమాండ్‌లతో గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. ఈమేరకు మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో కార్మికులు చేపట్టిన సమ్మెకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్ హాజరై ప్రసంగించారు. 33జిల్లాల్లో 50వేలమందికిపైగా మంది పని చేస్తున్నారని, మల్టీపర్పస్ విధానం పేరుతో శ్రమదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా కార్మికులు చనిపోతే నష్టపరిహారం కింద కనీసం రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కార్మికులు మురికిలో పని చేస్తారు కాబట్టి వారిని ఆరోగ్య భద్రత ఇవ్వాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



హన్వాడలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

**జడ్చర్లలో...**జడ్చర్లలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చేపట్టిన కార్మికుల సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వర్కర్లు ఉండరని చెప్పిన సీఎం కేసీఆర్ నేడు మల్టీపర్పస్ విధానం పేరుతో పంచాయతీ కార్మికుల శ్రమను దోడిపీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాల జీవోను సవరించేవరకు సీఐటీయూ పోరాడుతుందని స్పష్టం చేశారు. కేంద్రం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగం వ్యవహరిస్తున్నదని, సంపద సృష్టి కర్తలైన కార్మికులపై చిన్నచూపు చూస్తుందన్నారు. స్వతంత్ర్యం వచ్చి 75ఏండ్లు పూర్తయినా విద్యా, వైద్యం, నివాసానికి కార్మికులక దూరమవుతున్నారని చెప్పారు. కార్మికులు చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



జడ్చర్లలో మాట్లాడుతున్న తెలుగు సత్తయ్య

## పీఈటీ రూపకు ఖోఖో నిర్వహణ అవార్డు..

**నారాయణపేట ప్రతినిధి, జూలై 14 ప్రభాతవార్త :** ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి ఆదేశాల మేరకు జూన్ 30న అంతర్జాతీయ జాతీయ ఖోఖో దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేంద్రాలలో, మండల కేంద్రాలలో ఖోఖో పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ నిర్వహణ ఖోఖో అవార్డుకు కర్ని పాఠశాల పిఈటి రూప ఎన్నికైనట్లు, తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో ప్రధాన కార్యదర్శి విలియం ద్వారా సమాచారం అందినట్లు తెలిపారు. అవార్డు ఎంపికతో రూప ఆనందాన్ని వ్యక్తం చేస్తూ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. పీఈటి రూప మాట్లాడుతూ పాఠశాల హెచ్‌ఎం రఘువీర్ నామాజీ, ఉపాధ్యాయ బృందం, విద్యా కమిటి చైర్మన్, సర్పంచ్ అక్రమ్, ఎంపిటిసి రంగప్ప, విశ్రాంత పీఈటి బి. గోపాలం, జిల్లాలోని పీఈటీలు సౌమ్య,మీనాకుమారి, శ్రీవాణి, స్వరూప,విష్ణువర్ధన్, ఈశ్వర్, అమ్రేష్, రమేష్, చక్రవర్తి, రాజు, మంజుల వీరందరి సహకారంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించినందుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఖోఖో నిర్వహణ అవార్డు వచ్చిందని వీరందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. పీఈటీ రూప రాష్ట్రస్థాయి ఖోఖో ఉత్తమ నిర్వహణ అవార్డుకు ఎంపికైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ని పీఈటీ రూప విద్యార్థి దశలో మూడు జాతీయ స్థాయి ఖోకో పోటీలలో పాల్గొని ప్రశంసా పత్రాలు పొందారు. 20 సార్లు రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారు. త్వరలో ఈనెలలో హైదరాబాద్‌లో జరిగే అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. రాష్ట్ర, అంతర్జాతీయ, జాతీయ ఖోఖో దినోత్సవ పోటీల ర్యాలీ నిర్వహించినందుకు రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన బి. రూపను రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి , జిల్లా డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి, జిల్లా క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు విలియం, పి. నరసింహగౌడ్, బి.గోపాలం, తాన్‌సింగ్, సత్యాంజనేయులు, రమణ, సాయినాథ్, క్రీడాకారులు అభినందించారు.



పీఈటి రూప

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..

**-ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**అచ్చంపేట, జూలై 14 ప్రభాతవార్త:**అచ్చంపేట మండలం హాజిపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 100 మంది ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గువ్వల పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, మౌళిక సదుపాయాల కల్పనను చూసి పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని, నాయకుల వైఖరి నచ్చక రైతులకు 3 గంటల విద్యుత్ సరిపోతుందనడం, రైతన్నలను ఆగం పట్టించే విధంగా రేవంత్‌రెడ్డి వ్యవహారిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులకు మేలు చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశ పెట్టిందని, రైతులకు ఉచిత విద్యుత్ 24 గంటల పాటు అందిస్తూ రైతులకు కేసీఆర్ అండగా నిలుస్తున్నారని, ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందిస్తూ ఆ కుటుంబానికి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు పోకల మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు పర్వతాలు, అచ్చంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, లోక్యనాయక్, తిరుపతియాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో
ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

**-అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**దేవరకద్ర,జూలై 14 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదతర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సం ఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. మహామంగళహారతి,ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణిలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



వాసవిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

## చదువుతో పాటు వారి నైపుణ్యాన్ని వెలికి తీయాలి : జడ్పీ చైర్మన్

**వనపర్తి,జూలై14,ప్రభాతవార్త:** నెహ్రూ యువశక్తి ఫౌండేషన్ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చిత్రలేఖనం గోపాల్‌పేట మండలం బుద్దారంలోని గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు.ఈచిత్రలేఖనం పోటీలలో వనపర్తిజిల్లాలోని అన్ని మండలాల నుండి దాదాపు 100కిపైగా బాలికలు పాల్గొని వివిధ రకాల బొమ్మలను గీశారు. పోటీలలో వనపర్తి జిల్లా వాసి ప్రేమ్ టైలర్ నానమోని మన్యం కూతురు నానమోని కావేరి ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు.జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి కావేరిని అభినందించి ప్రథమ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ... యువత చదువుతో పాటు వారి నైపుణ్యాన్ని వెలికి తీయాలని అన్నారు. కావేరిని అభినందిస్తు భవిష్యత్ కాలంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన కోరారు.అనంతరం కావేరి తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఆర్సీవో వనజ, డీసీవో రవీందర్, ప్రిన్సిపాల్ ఆరోగ్యం, జడ్పీటీసీ భార్గవి, సర్పంచ్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



కావేరికి ప్రథమ బహుమతి అందజేస్తున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

## దళితులను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వం..

**- జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఆగపోగు కుమార్**

**వనపర్తి టౌన్,జూలై14,ప్రభాతవార్త:** దళితులను ఓటు బ్యాంక్‌గా కేసీఆర్ ప్రభుత్వం వాడుకుంటుంది అని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఆగపోగు కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ దళిత మోర్చా అధ్యక్షులు కొప్పు భాషా ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సీ కార్పోరేషన్ సంస్థను ఎత్తివేసి ఎస్సీలకు చాలా అన్యాయం చేశారని, టీఆర్ఎస్ పార్టీలో ఉన్న వారే దళితులా రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రానికి ముఖ్యమంత్రా లేక టీఆర్ఎస్ పార్టీకి ముఖ్యమంత్రా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంతోమంది నిరుపేద దళితులు ఉన్నా గులాబీ జెండా మోసిన వారికే దళితబంధు ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు ఇవ్వాలని , ఎంపిక ప్రక్రియలో పార్టీల పక్షపాతం లేకుండా ఉండేందుకు జిల్లా కలెక్టరన ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన పేద ఎస్సీలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, డప్పు కొట్టేవారికి చెప్పులు కుట్టే వారికి రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినపతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బుడ్డన్న, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సీతారాములు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గొర్ల బాబురావు, జిల్లా కార్యదర్శి చెన్నయ్య, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు కొమ్ము సామెల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ద్యారపోగు సుబ్రహ్మణ్యం, నందిమల్ల రవి, పట్టణ ప్రధాన కార్యదర్శులు సూగూరు రాములు, రాయన్న, గోవింద్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,జూలై 14 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 6 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2411 ధర పలికింది. అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్‌అధికారులు తెలిపారు.

## యువత స్వయంశక్తితో ఎదగాలి:సర్పంచ్

**కోయిల్‌కొండ,జూలై 14 ప్రభాతవార్త :** యువత స్వయంశక్తితో ఎదగాలని గ్రామ సర్పంచ్ బి.కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండ లోని స్వామి వివేకానంద చౌరస్తా ప్రాంతంలో నూతనంగా నెలకొల్పిన టీకింగ్స్ హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు స్వయం శక్తితో ఎదిగి ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రోజా జగన్‌గౌడ్, మండల టిఆర్ఎస్ యువజనవిభాగం అధ్యక్షులు పి.లక్ష్మినారాయణగౌడ్,టిఆర్ఎస్‌పార్టీ నాయకుడు బుల్లెట్‌శ్యామ్‌సుందర్,బాల్‌కిషన్,వెంకటాచారి,హోటల్ నిర్వాహకులు సునిల్, శ్రీకాంత్, రామచందర్, తారాసింగ్ పాల్గొన్నారు.



## 12.6 ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం

**దేవరకద్ర,జూలై 14 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో రోజు రోజుకు నీటిమట్టం పెరుగుతుంది. తీలేర్ పంపహౌజ్ నుండి 1మోటర్ ద్వారా శుక్రవారం కృష్ణ జలాలను కోయిల్‌సాగర్‌కు తరలించారు.దీంతో కోయిల్‌సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది.శుక్రవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 12.6 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 19.9ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండ టంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.

## ఘనంగా మల్లురవి జన్మదిన వేడుకలు

**అచ్చంపేట,జూలై 14 ప్రభాతవార్త:**అచ్చంపేట పట్టణంలో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లురవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



## చిరుధాన్యాలపై అవగాహన పెంచాలి..

**జడ్పీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై 14 ప్రభాతవార్త :** చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ యాదయ్య అన్నారు. శుక్రవారం జడ్పీ సీఈఓ ఛాంబర్‌లో నిర్వహించిన మూడవస్థాయి సంఘం (వ్యవసాయం) సమావేశంలో చిన్నచింతకుంట జడ్పీటిసి వట్టెం రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు ఎండి అల్లావుద్దిన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు అధికారులు దృష్టి సారించాలని, పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలని, చిరుధాన్యాల పంటలు వేయడం వల్ల భూసారం పెరుగుతుందని, తక్కువ కాలంలో పంట చేతికొస్తుందని, చిరుధాన్యాలకు మార్కెట్లో డిమాండ్ ఉందని తెలిపారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని నాణ్యమైన నకిలీ విత్తనాలపై దృష్టి సారించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ రైతుభీమా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సీఈఓ జ్యోతి, జిల్లావ్యవసాయ అధికారి వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే తండాల అభివృద్ధి..

**మిడ్జిల్,జూలై 14 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే తండాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి తండాలను అభివృద్ధి పరిచే విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని మిడ్జిల్ ఎంపిపి బరిగల సుదర్శన్, జడ్పీటిసి శశిరేఖ బాలు అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తండాలు గ్రామ పంచాయతీల ఏర్పాటుకు పోరాటాలు చేసిన గత ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోలేకపోయాయని అన్నారు. కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులు కేటాయించి తండాలకు గ్రామ పంచాయతీ నిర్మాణంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కృషి చేసిన లక్ష్మారెడ్డికి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ మంజుల భాస్కర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పాండుయాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు బాలు, ఉపసర్పంచ్ తిరుపతి, లక్ష్మణ్ పవర్ నాయక్, గోపినాయక్, శంకర్‌నాయక్, ఉష్యానాయక్, రెడ్డినాయక్, చందు నాయక్, జిప్లో నాయక్, కృష్ణనాయక్, శంకర్‌నాయక్, భద్రనాయక్, శ్రీనునాయక్, రాందాస్‌నాయక్, లోక్యనాయక్ పాల్గొన్నారు.



# సాయిచంద్ తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

◆ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గాయకుడు సాయిచంద్
◆ సాయిచంద్ అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు: ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై14 ప్రభాతవార్త:** మలిదశ తెలంగాణ ఉద్యమంలో పల్లె పల్లెన తెలంగాణ నినాదాన్ని వినిపించేందుకు కాలికి గజ్జె కట్టి ఆటపాటలతో తెలంగాణ ప్రజానీకాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు రాత్రింబవళ్లు ఎనలేని కృషి చేసి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గాయకుడు వేద సాయిచంద్. ఆటపాటతో కేసీఆర్‌ను మెప్పించితెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆంధ్రా వలస పాలకుల పాలనలో ఆగమైన తెలంగాణ బ్రతుకులను తన పాఠం ద్వారా గళం విప్పి ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కీలక పాత్ర పోషించి చావైనా, బ్రతుకైన తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పనిచేసినగాయకుడు సాయిచంద్. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కళాకారుల ఆటపాటలతో ప్రజలను చైతన్యపరుస్తూ రాత్రిబొమ్మల్లో కొలువైన శివుడా అనే పాటతో ఆడబిడ్డలను కంటతడి పెట్టించి తెలంగాణ ఉద్యమానికే మార్గదర్శకుడయ్యాడు సాయిచంద్. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడైన శ్రీకాంతాచారి పేరుతో పాటలను రాస్తూ విద్యార్థి అమర వీరుల ఆత్మఘోషను కళ్లకు కట్టినట్లుగా చూపిస్తూ ప్రజల గుండెల్లో ఆంధ్రా వలస పాలకుల పాలనలో ఆరాచాలకు గురై తెలంగాణ వెనుకబాటు తనానికి గురైనవిధానాన్ని వివరిస్తూ తెలంగాణ నినాదాన్ని ప్రతి పౌరుడు మనస్సులో నాటుకుపోయే విధంగా సాయిచంద్ గళాన్ని విప్పుతూ ఆంధ్రా వలస



సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకుల పాలనపై గర్జించిన సాయిచంద్ అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిలు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన సాయిచంద్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భైకాని శ్రీనివాస్‌యాదవ్‌లు హాజరై వేద సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం సభ విజయవంతం కావడంతో సాయిచంద్‌ను సన్మానిద్దామని అనుకున్నాము కాని ఇంతలోనేసాయిచంద్ అకాలమరణం చెందడంతో సంతాప సభ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిచంద్ బీఆర్ఎస్ పార్టీకి మూలస్తంభమని, మాకు దేవుడిచ్చిన తమ్ముడన్నారు. సాయిచంద్ అకాల మరణవార్త విని తట్టుకోలేకపోయామన్నారు. జిల్లా కేంద్రంలో సాయిచంద్ క్యాంస విగ్రహా ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సాయిచంద్ కుమార్తె పేరిట రూ.21లక్షల డిపాజిట్ చెక్కును అందిస్తానని ఎమ్మెల్యే మర్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కరఘునందన్‌రెడ్డి, కవి మిట్టపల్లి సురేందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## ఘనంగా హజ్రత్ బాలే షహీద్ దర్గా ఉర్సు ఉత్సవాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 14 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువు కట్టపై వెలిసిన హజ్రత్ బాలే షహీద్ రహమతుల్లా అలై ఊర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ధీపారాధనతో ఉత్సవాలు ముగిశాయి. గురువారం రాత్రి ఖాజీపుర వీధిలోని దర్గా ముతవల్లి మొహమ్మద్ ఫయాజ్ నివాసం నుంచి గంధం ఊరేగింపుగా బయలుదేరింది. అంతకు ముందు ఆయన నివాసంలో ఖవ్వాలి, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా గంధం దర్గా వద్దకు చేరుకోగా భక్తి శ్రద్దల మధ్య అధ్యాత్మిక కార్యక్రమాలతో చాదర్ల సమర్పణ, ఫాతిహా అనంతరం ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లీలు మహమ్మద్‌ఫయాజ్ ఖాన్, అయాజ్ ఖాన్, మత పెద్దలు సాధిక్ పాషా నక్ష బంధి, షేక్‌యాఖుబ్‌బావాజీర్, షేక్ అబ్దుల్లా బావాజీర్, జామియా నిజామియా అలీంమహమ్మద్ షాకేర్‌సిద్దిఖీ, మున్సిపల్ కౌన్సిలర్లు మహమ్మద్ ఖాజాఖాన్, నిజాంలతో పాటు ముస్లిం మత పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**అలంపూర్, జులై 14 ప్రభాతవార్త:** మానవపాడు నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆశీర్వదించారు. ఆయనతో పాటు డిసిసిప్రెసిడెంట్ పటేల్ ప్రభాకర్ రెడ్డి, పిసిసి డెల్గేట్ శంకర్, వడ్డేపల్లి టౌన్ ప్రెసి డెంట్ చిన్ని మహిళా అధ్యక్షురాలు నాగశిరోమణి, వడ్డేపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణకాంత్, ధరూర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, పచ్చర్ల కుమార్ ఉన్నారు.

## కోదండపురం ఎస్సైగా కృష్ణదేవ బాధ్యతలు



**ఇటిక్యాల, జులై 14 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోదండపురం పోలీస్ స్టేషన్‌ఎస్సైగా కృష్ణదేవ శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో పదవి బాధ్యతలు తీసుకున్నారు. నాలుగు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర డిజిపి ఆదేశాలతో జిల్లాలో ఎస్సైలను బదిలీ చేయగా ఇక్కడ పని చేస్తున్న ఎస్సై వెంకటస్వామి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కృష్ణదేవ శుక్రవారం ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానని ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

## పశువర్ధక శాఖ వార్షికోత్సవాలు

**నారాయణపేట ప్రతినిధి, జులై 14 ప్రభాతవార్త:** పశుసంవర్ధకశాఖ నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ప్రాంతీయ పశువైద్యశాల ఆధ్వర్యంలో పశుపోషకుల పశుగ్రాస క్షేత్రాలను సందర్శిచి పశుగ్రాస మేత ఆవశ్యకతను సహాయ సంచాలకులు డా. మీరజ్ అహ్మద్ ఆధ్వర్యంలో పశుపోషకులకు వివరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పశువులకు అవసరమైన ఎలాంటివారైనా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు దివాకర్, పశు పోషకులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ



**మక్తల్, జులై 14 ప్రభాతవార్త:** పట్టణంలోని చెరువుకట్ట సమీపంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భూమిపూజ చేపట్టగా పెద్ద సంఖ్యలో గౌడ సంఘం నాయకులు ప్రతినిధులు హాజరయ్యారు. వీలైనంత త్వరగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలోగౌడ సంఘం రాష్ట్రస్థాయి నాయకులు చంద్రకాంత్‌గౌడ్, నర్సింలు, కిష్టయ్యగౌడ్, నాగరాజుగౌడ్, జగదీష్‌గౌడ్, విజయమ్మ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



**ఇటిక్యాల, జులై 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ధర్మవరం గ్రామం నుండి యువత అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి సర్పంచ్ రవి, మండల పార్టీ అధ్యక్షుడు రుక్మానందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సామాన్య కార్యకర్తలే రేపటి ముఖ్య నాయకులవుతారని రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఎలాంటి వర్గ విభేదాలు లేకుండా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు పని చేయాలనివివరించారు. కాంగ్రెస్ పార్టీలోచేరిన వారిలో శేఖర్‌నాయుడు, బి.నాయుడు, ఆంజనేయులు, ఖాజాబాయ్, చిన్నరాముడు, హుస్సేన్ యాదవ్, బీచుపల్లి నాయుడు, నాగరాజుగౌడ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## 16న పాత పెన్షన్ విధాన సాధన సంకల్ప యాత్ర

● పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర పోస్టర్లను విడుదల చేసిన ఉపాధ్యాయులు



సంకల్ప యాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**ఇటిక్యాల, జులై 14 ప్రభాతవార్త:** ఈనెల 16వ తేదీన అలంపూర్ నుండి జోగులాంబ జిల్లా కేంద్రంలో జరిగే పాత పెన్షన్ విధాన సాధన సంకల్ప యాత్రకు ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఆర్. మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జీవశాస్త్రం సబ్జెక్టుపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించగా భోజన విరామ సమయంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు తలపెట్టిన సాధన సంకల్పయాత్ర పోస్టర్లను ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా నాయకులుమోహన్, ఇతర ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ సమావేశంలో ఉపాధ్యాయ నాయకులు ఆర్. మోహన్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధాన సాధన సంకల్పయాత్ర ఈనెల 16వ తేదీన ఆదివారం ఉదయం జోగులాంబ ఆలయం నుండి ప్రారంభమై అలంపూర్ చౌరస్తా, ఎర్రవల్లి చౌరస్తా మీదుగా గద్వాల జిల్లా కేంద్రానికి చేరుకుంటుంది. అలాగే గద్వాలలో రాజీవ్‌మార్గ్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా బృందావన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున సిపిఎస్ ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి అంశాలపై ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధం కావాలని అంతేకాక ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న మొండివైఖరిని ఎండగట్టేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులలో అనేక సమస్యలు ఉన్న ఇప్పటివరకు పరిష్కరించలేదని అదేవిధంగా ఉపాధ్యాయుల బదిలీలుగాని ప్రమోషన్లు గాని చేపట్టలేదని ఖాళీగా ఉన్నటువంటి విద్యా వాలంటీర్ల పోస్టులను భర్తీ చేయకుండా ఉన్నటువంటి విద్యా వాలంటీర్ల పోస్టులను భర్తీ చేయకుండా ఉన్నటువంటి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం దురదృష్టకరమని చాలా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు ఎంతగానో నష్టపోతున్నారని అంతేకాక లక్షలాది మంది నిరుద్యోగులు కొత్త ఉపాధ్యాయుల పోస్టుల కోసం ఎదురు చూస్తూ ఉండిపోయారని సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వేలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయులు ప్రశ్నించారు.

## ఇంటింటికి బీఆర్ఎస్ పథకాలపై అవగాహన

**వనపర్తి టౌన్, జూలై14, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలోని 1వ, 2వ వార్డులలో వార్డు కౌన్సిలర్లు కాగితాల లక్ష్మి నారాయణ, శారద ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. 2వ వార్డు అధ్యక్షులు రామస్వామి, వార్డు కార్యవర్గం కార్యకర్తల ఆధ్వ ర్యంలో రాయిగడ్డ, నడిమిగేరి, కమాన్ చౌరస్తా, బ్రాహ్మణ వీధులలో ఇంటింటికి తిరుగు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడినడ నిరంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, వనపర్తి పట్టణ ఇంచార్జీ అరుణ్ ప్రకాష్, మున్సిపల్ కౌన్సిలర్లు కంచె రవి, నక్క రాములు, పుట్టపాకుల మహేష్, బండారు కృష్ణయ్య, స్టార్ రహీం, గంధం శరవంద, నందిమల్లశ్యామ్, గోపాల్ యాదవ్, పెండెం నాగన్న యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు గంధం పరంజ్యోతి, ఆవుల రమేష్, శ్రీనివాసులు, చీరలకేశవులు, డాక్టర్ దానేలు నాగన మోని నాగమ్మ, గొర్రెల రామచంద్రయ్య, గంధం శాంతి, కొమ్ము లక్ష్మి, జములమ్మ, పుష్పక్ యాదవ్, రఘు, బంగాలేపేట తిరుపతయ్య, యుగంధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



ఇంటింటికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి : జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ జీ

**వనపర్తి వైద్య విభాగం, జూలై14, ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ జీ అన్నారు. శుక్రవారం డెంగ్యూ మహోత్సవంలో భాగంగా ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని ఎన్టీఆర్ కాలనీ, గాంధీ నగర్ ఏరియాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ జి మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభంలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అధిక సంఖ్యలో వృద్ధి చెంది వివిధ రోగాలను కలగజేస్తాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ తమ ఇండ్లలో ప్రతి రెండు మూడు రోజులకొకసారి సంపులు, ట్యాంకులు, డ్రమ్ములు , నీటి కుండలు ,నీరు నిల్వ ఉన్న పాత్రలను శుభ్రంగా కడగాలని వాటిపై దోమలు వాలకుండా మూతలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారిని ప్రజలకు అందుబాటులో ఉండి దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంసీహెచ్ఈవో రవీందర్‌గౌడ్, హెల్త్ అసిస్టెంట్ గంధం రాజు, శ్రీనివాసులు, రాము, ఏఎన్ఎంలు సుమిత్ర, అరుణ, మహేష్, ఆశా కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు వేసి అనుసంధానం చేస్తా

- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**వీపనగండ్ల, జూలై14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని అన్నారు. గతంలో లేని విధంగా ప్రశాంతమైన వాతా వరణంలో పల్లెల్లో పాలన సాగుతుందని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. రూ.22 లక్షలతో నిర్మించిన రైతు వేదిక భవనం, కల్వరాల నుండి బుసిరెడ్డిపల్లి మీదుగా జమ్మాపూర్ వరకు 4 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అసంపూర్తిగా నిర్మించిన గ్రంథాలయ భవనానికి సీడీపీ , ఎంపీపీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసి గ్రంథాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. వీపనగండ్ల మండల కేంద్రంలో కల్వరాల గ్రామ పంచాయతీ సరస్వతి నిలయమని, ఇక్కడి నుండి చాలా మంది విద్యావంతులు గొప్ప స్థాయిలో ఉన్నారని, ఈ గ్రామాన్ని ఎవరిహాయాంలో అభివృద్ధి చెందిందో ప్రజలు, మేధావులు ఆలోచించాలని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సైన్స్ ల్యాబ్ మంజూరు చేసి నిర్మించామని వారు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్ రావు, జడ్పీటీసీ మాధురి కిరణ్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ రామన్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, కల్వరాల సర్పంచ్ రఘునాథ్ రెడినడ, సంపత్రావ్‌పల్లి సర్పంచ్ రామేశ్వర్ రావు, గోపాల్‌దిన్నె సర్పంచ్ విజయ్ కుమార్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో కథాలప్ప, బీఆర్ఎస్ నాయకులు ముంత మల్లయ్య, సర్దార్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

## ఎంపిపిగా ఎన్నికైన సుదర్శన్‌ను సన్మానించిన యూత్‌వింగ్ అధ్యక్షులు



నూతనంగా ఎన్నికైన ఎంపిపి సుదర్శన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**మిడ్జిల్, జులై 14 ప్రభాతవార్త :** మండలంలో నూతనంగా ఎన్నికైన మిడ్జిల్ ఎంపిపి బరిగెల సుదర్శన్‌ను నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ మండల యూత్‌వింగ్ అధ్యక్షులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిడ్జిల్ మండల బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ వింగ్ అధ్యక్షుడు పట్నం బంగారు మాట్లాడుతూ మిడ్జిల్ మండలంలో బిఆర్ఎస్ పార్టీ నుండి ఎంపిపిగా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మిడ్జిల్ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి దశలో తీసుకువెళ్లాలని కోరారు. ఎంపిపి సుదర్శన్ మాట్లాడుతూ నన్ను సన్మానించిన నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ మండలాల యూత్ అధ్యక్షులు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు శేఖర్ యాదవ్, బాల్‌నగర్ యూత్ అధ్యక్షులు స్వప్న ప్రకాష్, రాజాపూర్ టిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు శ్రీనుయాదవ్, జడ్చర్ల టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు వీరేష్ పాల్గొన్నారు.

## మండల స్థాయి ఉపాధ్యాయుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాసునాయక్

**వెల్దండ, జూలై 14 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన్‌లో మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశానికి ఎంఈఓ శంకర్‌నాయక్ హాజరై మాట్లాడుతూ నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల కోసం తమ వ్యక్తిగత సమాచారాన్ని రెండు రోజుల్లో అందించాలన్నారు. ఈ నెల 18న జిల్లా కేంద్రంలో శిక్షణ ఉంటుందని, ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థులను మెరుగుపరిచి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య, రాజశేఖర్, నర్సింహ్మ, రామారావుతో పాటు తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జూలై 14 ప్రభాతవార్త:** వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటిక బుచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేశమల్ల కృష్ణ పరామర్శించి రూ.4వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబానికి అన్ని విధాలు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, రాములు, భాష, సుధాకర్, హరిలాల్, భరత్, అంజ్యనాయక్, ప్రశాంత్ ఉన్నారు.

## దోమల నివారణకు డ్రై డే



మురుగునీటిని పారబోస్తున్న దృశ్యం

**వెల్దండ, జూలై14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ మేళాలో భాగంగా దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి పల్లె దవాఖాన వైద్యులు యాదయ్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో, ఆవరణలో నీటినిలువ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఉన్న మురుగునీటిని పారబోశారు. దోమల భారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గోవర్ధన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## స్వీపర్ల దీక్షలు..పాఠశాలలు అపరిశుభ్రం!



అపరిశుభ్రంగా ఉన్న పాఠశాల గదులు

**వెల్దండ, జూలై 14 ప్రభాతవార్త:** పార్ట్ టైం స్వీపర్లను క్రమబద్దీకరించాలని కోరుతూ దీక్షల్లో ఉన్నందున ప్రభుత్వ పాఠశాలలు అపరిశుభ్రంగా మారాయని వెల్దండ మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీపర్లు దీక్షలో ఉన్నందున పాఠశాల గదులతో పాటు ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా మారుతుందని, వారి సమస్యలను పరిష్కరించాలి లేదా వారి స్థానాల్లో వేరే వారిని నియమించాలని కోరారు. 4 రోజులకే పరిస్థితి ఇలా ఉంటే... మరిన్ని రోజుల్లో ఎక్కువ చేస్తే పరిస్థితి మరింత ఘోరంగా ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు



**వెల్దండ, జూలై 14 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో గత 15 రోజుల క్రితం సబ్‌స్టేషన్‌లో పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌కు గురై పేలిపోయింది. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన గ్రామా నికి సరైన విద్యుత్ అందకపోవడంతో గ్రామస్తులు, వ్యవసాయ పొలాలకు ఇబ్బందులు తలెత్తడంతో సమస్యపై గ్రామస్తులతో కలిసి బీజేపీ నాయ కులు పరమేశ్వర్‌గౌడ్ జిల్లా ఎస్ఈకి వివరించడంతో స్పందించిన అధికారి మూడు రోజుల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ సూర్య నాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్‌నాయక్‌తో పాటు విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది న్యాయమైన పోరాటానికి బీజేపీ అండగా ఉంటుంది

**అడ్డాకుల, జూలై14, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది సంఘం జేఏసీ ఆధ్వర్యంలో వారి హక్కుల సాధనకై గత 9 రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్నారని, వారి హక్కులు న్యాయమైనవిగా భావించి వారి సమ్మెకు బీజేపీ మండల శాఖ మద్దతు తెలుపుతుందని బీజేపీ దేవరకద్ర ఇంచార్జీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎగ్గని నర్సింలు అన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది జేఏసీ ఆధ్వర్యంలో వారి న్యాయమైన డిమాండ్ల కోసం 9 రోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతున్నామని, వారి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, బీజేపీ నాయకులు దేవరకద్రబాలన్న, గట్టుమల్లేష్, వేగనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నగౌడ్, బుచ్చన్న, తిరుపతి, రాజు, రమేష్ సాగర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ దేవరకద్ర ఇంచార్జీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎగ్గని నర్సింలు

# సీజనల్ వ్యాధులను అరికట్టాలి

● జడ్పీ‌చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై14 ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన నాలుగవ స్థాయి సంఘం (విద్య, వైద్యం) సమావేశంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అన్వర్ హుసేన్‌తో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు గ్రామాలలో నీరు నిలవకుండా చూడాలని అన్నారు. కంటివెలుగు పథకం ద్వారా కంటి పరీక్షలునిర్వహించి ఉచింగా కంటి అద్దాలు ఇవ్వడం జరిగిందన్నారు. ధూమపానం నివారణకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు ప్రతి విద్యార్థికి అందేవిధంగా చూడాలన్నారు. ఎస్ఎస్‌సి టాప్ టెన్ రావాలన్నారు. మన ఊరు మనబడి పథకం ద్వారా పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుకావడంవల్లనో అడ్మిషన్ బోర్డులు పదినుంచి పదిహేను స్కూల్లో పెట్టడం జరిగిందన్నారు.

**ఐదో స్థాయి సంఘం సమావేశం:** మహిళలు ప్రభుత్వం ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవాలి మహబూబ్‌నగర్ జడ్పీటిసి వెంకటేశ్వరి శుక్రవారం జడ్పీ సీఈఓ చాంబర్‌లో ఐదవ స్థాయి సంఘం సమావేశం (స్త్రీ, శిశు సంక్షేమం) సమావేశంలో హన్వాడ ప్రాదేశిక సభ్యులు విజయనిర్మలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలకు ప్రభుత్వం ఇచ్చే బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మహిళ సంరక్షన చట్టాలపై అవగాహన కల్పించాలని బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మహిళ సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలని బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల కబ్జాలు?!

● అక్రమార్కులకు అండగా అధికారుల మార్గదర్శకాలు





ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటున్న దృశ్యం

**అలంపూర్,జులై 14 ప్రభాతవార్త:** రాజోలి మండలం ముండ్లదిన్నె గ్రామంలో సర్వే నంబర్ 4లో గతంలో ప్రభుత్వ ప్లాట్లను పంచగా, మిగులు ప్రభుత్వ స్థలంను గతంలో కొంతమంది దేవుని పేరుతో అమ్మకాలకు గురి చేస్తుండగా కొంతమంది గ్రామస్తులు దానికి వ్యతిరేకంగా ప్రభుత్వం స్థలం అమ్మొద్దంటూ వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసి అధికారుల సహకారంతో ప్రభుత్వ భూమిని కాపాడి, గ్రామ సర్పంచ్‌కు చెప్పగా ప్రభుత్వ స్థలాన్ని కాపాడడానికి తమ నిధులను ఖర్చుచేసి ప్రభుత్వ స్థలానికి కంచెను వేయించి కాపాడడం జరిగింది. కానీ ప్రస్తుతం నిన్నటిరోజు నుండి గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు అమాయక ప్రజలను రెచ్చగొట్టి గ్రామంలో ఒకరినొకరు గొడవలను సృష్టించే విధంగా ప్రభుత్వ స్థలంలో కొట్టాలు వేసుకోండని వారిని ప్రోత్సహించగా కొంతమంది స్థలంలో కర్రలతో హద్దులను ఏర్పాటు చేసుకుని గ్రామంలో ఒకరినొకరు నాకు కావాలి అంటూ ఒకరికొకరు అలజడులు చెలరేగుతున్నాయి. గ్రామంలో ప్రభుత్వ భూములు చాలా మటుకు ఇదే కోవలోనే ఆక్రమణకు గురవుతూ లక్షల రూపాయలకు కూడా క్రయ విక్రయాలు జరుగుతుండడం చాలావిడ్డూరం. ఇంత జరుగుతున్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారికి తెలిపిన ఏమీ పట్టనట్లు మీకేమీ తెలియదు అన్నట్లు వారి మాటలు అక్రమార్కులకుమార్గదర్శకాలుగా ఉపయోగపడుతుండడం అధికారుల పదానికి సిగ్గుచేటు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూములను, స్థలాలను కాపాడతారని ఆశిస్తున్న గ్రామ ప్రజలు. ఇంతవరకు కూడా ప్రభుత్వ స్థలాలను కాపాడే పరిస్థితి లేకుండా పోయింది.

# సత్ప్రవర్తనతోనే ఉన్నత శిఖరాలకు: ఎస్సై



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట,జులై 14 ప్రభాతవార్త :** సత్ప్రవర్తనతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని స్థానిక ఎస్సై ఆర్. శేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వాడకాన్ని చెడుకు కాకుండా జ్ఞానానికి ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. నేటి ప్రపంచంలో సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో విజృంభిస్తున్నారని అలాంటి వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఎస్సై తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను చక్కగా విని పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయినప్పుడే తల్లిదండ్రులు సంతోషిస్తారని, ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదువుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# విద్యార్థులకు టై బెల్టుల పంపిణీ



**కల్వకుర్తి, జూలై 14 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని 7వ వార్డు సుభాష్‌నగర్ హరిజన వాడలోని పాఠశాలలోని విద్యార్థులకు కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు తన స్వంత ఖర్చులతో తయారు చేయించిన టై, బెల్టుల పంపిణీ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్ హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు నాణ్యమైన అందుతుందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పించే వసతులను సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయురాలు సరస్వతి, కోఆప్షన్ సభ్యులు సాబేర్, సీనియర్ నాయకులు రావుల చెన్నకేశవులు, నాయకులు దున్న సురేష్, రవి, పంబాల కుమార్, నవీన్, రాము, సుజానమ్మ, బుజ్జమ్మ తదితరులు ఉన్నారు.

# వివాహ వేడుకలకు హాజరైన బిఆర్ఎస్ యువజన నాయకులు

**అలంపూర్,జులై 14 ప్రభాతవార్త:** మానవపాడు మండల పరిధిలోని అమరవాయి గ్రామంలో వివాహానికి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపిటిసి రోషన్న, మాజీ జడ్పీటిసి ప్రకాష్‌గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కిశోర్ అన్న యువసైన్య సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

● అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహాం ● రూ. 30 లక్షలతో సిసి రోడ్లు, బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ

**ఇటిక్యాల,జులై 14 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, అలాగే ఆయా వర్గాలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడితే గ్రామాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ప్రజలకు కలుగుతాయని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో 10 లక్షలతో సిసి రోడ్లు, 10 లక్షలతో బిసి కమ్యూనిటి హాల్ నిర్మాణాలకు స్థానిక సర్పంచ్ నాగేశ్వరి శివుడుతో కలిసి అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం భూమిపూజ చేశారు. అదేవిధంగా ఎర్రవల్లి గ్రామ పంచాయతీలోని పదవ బెటాలియన్‌లో 10 లక్షలతో చేపట్టే సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో 9 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రం అన్ని వర్గాల వారికి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందని అలాగే వివిధ రకాల సంక్షేమ పథకాలు అందించి ప్రజలను ఆదుకుంటుందన్నారు. గ్రామాలలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఉండేందుకు సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతుందని అలాగే బిసి,మైనార్టీ, ఎస్సీలసంక్షేమం కోసం కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఈ నిర్మాణాల వల్ల ఆ వర్గాల ప్రజలకు మౌలిక వసతులు కల్పించినట్లు అవుతుందన్నారు. అదేవిధంగా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థుల కోసం విదేశీ ఉన్నత విద్య కోసం అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా ప్రభుత్వం 20 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందని రైతుల కోసం ఉచితంగా 24 గంటల పాటు విద్యుత్ సౌకర్యం అందిస్తుందని అంతేకాక ప్రభుత్వం ఆసుపత్రులలో ప్రసవాలు పెంచేందుకు మహిళలకు కెసిఆర్ కిట్ పథకం అందిస్తుందని అలాగే మన ఊరు మనబడి పథకం కింద గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి పాఠశాలల రూపురేఖలు మారుస్తుందని ముఖ్యమంత్రిసహాయనిధి ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. షాదీముబారక్,కళ్యాణలక్ష్మి, షాదీముబారక్,కళ్యాణలక్ష్మి, రైతుభీమా, రైతు బంధు వంటి పథకాలు అమలు చేస్తూ దేశంలో తెలంగాణ రాష్ట్రంముందు వరుసలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పదవ బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాష్, స్థానిక సర్పంచ్ నాగేశ్వరి శివుడు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు జయచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాముడు, సుంకన్న, ఈదన్న, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు శివుడు, యుగంధర్‌రెడ్డి, రాగన్న, పెద్ద లక్ష్మన్న,కృష్ణసాగర్, వేణుగోపాల్ నాయుడు, సూరి, ప్రభుదాసు, ఏఈ పాండురంగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం

# పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం పక్కాగా నిర్వహించాలి

● మహబూబ్‌నగర్ డీఈఓ రవిందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 14 ప్రభాతవార్త:** ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం పక్కాగా నిర్వహించాలని డీఈఓ రవిందర్ హెచ్ఎంలను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎఫ్ఎల్ఏ మోడల్ ఆఫీసర్స్ అలాగే ఎంఓఎంబి ఇంఛార్జిలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలోజిల్లాలోని అన్ని పాఠశాలలో టీచర్ల సర్దుబాటు కార్యక్రమం గురించి అట్లాగె ఎఫ్ఎల్ఎన్ గురించి మన ఊరు మనబడి వర్క్ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలలకు ఉచిత ఏక రూప దుస్తులు,పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల గురించి రివ్యూ చేశారు. ఈ నూతన విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలల్లో బోధన అభ్యసన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించాలని తెలిపారు. ప్రతి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించాలని దానికోసం అందుబాటులో ఉండే ఒక మంచి వక్తను ఎంపిక చేసుకుని విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించే వాళ్లని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం మూడో శనివారం నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రభావవంతంగా నిర్వహించాలని తెలిపారు. దానికోసం రాష్ట్ర విద్యాశాఖ నుండి వెలువడిన ఉత్తర్వులను ఎజెండాను తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వ్యక్తిగతంగా ఆహ్వానాలు పంపి పాఠశాలకు ఇన్వైట్ చేయాలని అట్లాగే గ్రామ పెద్దలను గ్రామ సర్పంచ్‌ను పాఠశాల అభివృద్ధి కోసం ఉపయోగపడే ప్రతి ఒక్క వ్యక్తిని ఒక సమావేశానికి పిలిపించి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని డీఈఓసూచించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి అధికారులు పాఠశాలల పర్యవేక్షణ చేసే అవకాశం ఉంది. ప్రధానోపాధ్యాయులు అందరు ఈ సమావేశాలను చాలా ప్రభావవంతంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో సమగ్ర శిక్ష జిల్లా సిఎంఓ బాలుయాదవ్ బైకాని, ఎఎంఓ, దంకుడు శ్రీనివాస్, డిఎస్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# రాబోయేది ఇందిరమ్మ రాజ్యం : మాజీ ఎమ్మెల్యే

**ఉండవెల్లి,జులై 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బైరాపురం, బస్వాపురం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ చాలా ఘనంగా నిర్వహించారు. రాబోయే రోజులలో ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని మహిళలకు వడ్డిలేని రుణాలు, 500లకే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు నిరుద్యోగ కల్పన, రైతులకు రైతు రుణమాఫీ, రెండు లక్షల రూపాయలు, ఇందిరమ్మ గృహాలే ఐదు లక్షల రూపాయలు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంబడే అమలు చేస్తామని సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. టిఆర్ఎస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తూ చెప్పిన హామీలను నెరవేర్చక కొత్త హామీలు చెప్పి దళితబంధు పేర్లతో మూడు ఎకరాల భూముల పేరుతో ఎవరికి హామీ నెరవ్చేకుండా తొమ్మిది సంవత్సరాలు గడిపింది. ఇక టిఆర్ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయి. టిఆర్ఎస్ నాయకులు మూడు గుంపులు,ఆరు వర్గాలుగాఅందరూ నక్కలు,తోడేల్లాగా దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు గ్రహించమని కాంగ్రెస్ పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నాగశివమణి, మాజీ కౌన్సిలర్ గంజిపేటశంకర్,ఉండవెల్లి మండల అధ్యక్షుడు గోపాల్, అలంపూర్ మండల అధ్యక్షుడు రాము, సర్పంచ్ నాగేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రవల్లిరవి, వడ్డేపల్లిటౌన్ అధ్యక్షులు చిన్నబాబు, నరసన్న గౌడ్,పాండు,మాజీసర్పంచ్ మద్దిలేటి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

# జొన్నరొట్టెల తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్,జులై 14 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గ మల్దకల్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య వారి సౌజన్యంతో సభ్యురాలు నాగమణి వెంకటేష్ జొన్నరొట్టెల తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. 2 లక్షల 40 వేల రూపాయలతో జొన్నరొట్టెల తయారీ కేంద్రం మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నాగమణి వెంకటేష్‌లు సన్మానించారు. ఎమ్మెల్యే మాటాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళలు చైతన్యం పెంచుకునే విధంగా వారు కేవలం ఇంటికే పరిమితం కాకుండా వారిలో ఉన్న నైపుణ్యతను ప్రతిభను ప్రదర్శించే విధంగా ప్రభుత్వం చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళా సమాఖ్య వారి బ్యాంకుల సహకారంతో 2 లక్షల 40 వేల రూపాయలతో మంజూరు అవడం జరిగింది. వారికి ప్రజలకు ఉపయోగపడే చిన్నచిన్న స్మాల్ ఇండస్ట్రీలను ఏర్పాటు చేసి మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలని సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం అన్ని విధాలుగా మహిళల కోసంఅనేకమైన స్మాల్ ఇండస్ట్రీస్‌లో వ్యాపారాలను అవకాశాలను కల్పించడం జరుగుతుంది. భవిష్యత్తులో కొంతమందికి మహిళలు రకరకాల కొత్తగా ప్రజలకు అతి తక్కువ సమయంలో ఎక్కువగా కాలం ఉపయోగపడే పరికరాలు, ఆరోగ్యం సంబంధించిన పౌష్టికాహార పదార్థాలను తయారు చేసేవిధంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని వారికి మా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపిలు రాజారెడ్డి, విజయ్, జడ్పీటిసి ప్రభాకర్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ ఎంపిపి వీరన్న, సర్పంచ్ యాకోబ్, మండలపార్టీ అధ్యక్షుడు వెంకటన్న, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అజయ్, నారాయణ, నర్సింహులు, తిమ్మరాజు, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



జొన్నరొట్టెల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**చిన్నంబావి,జులై14,ప్రభాతవార్త:** అభివృద్ధి , గ్రామ సంక్షేమం వైపే పెద్దదగడ గ్రామ ప్రజలు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కొల్లాపూర్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామ ఉప సర్పంచ్ చిన్న కొండయ్య, గ్రామ వార్డు సభ్యులు బాలకృష్ణ, మైబూస్, నాయకులు నాగరాజు, ముని, మంగలి రాజు తదితరులు శుక్రవారం ఎమ్మెల్యే బీరం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. 20 సం.ల పాలనలో సొంత ఊరిలో ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడం చేతకాని వారు గ్రామాన్ని అభివృద్ధి చేయలేని వారు ఇంకా నియోజకవర్గాన్ని ఏమీ అభివృద్ధి చేస్తారని ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే బీరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీని నమ్మి చేరిన వారికి అన్ని విధాల అండగా ఉంటామని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆయన అన్నారు. అందరం కలిసి కట్టుగా బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేయాలని, కొల్లాపూర్ ప్రాంత అభివృద్దే మనందరి ధ్యేయం అని , అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. సీఎం కేసీఆర్, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో భవిష్యత్తులో కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకుపోదామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, మహిచంద్ర , కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# జోగులాంబ ఆలయంలో ఎస్పీ పూజలు

**అలంపూర్,జులై 14 ప్రభాతవార్త:** శ్రీజోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి వార్లను శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ కె. సృజన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీకి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి,జూలై14,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడినడ నిరంజన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో శుక్రవారం మంత్రి సమక్షంలో పెద్దమందడి మండల పరిధిలోని చికిరిచెట్టుతండాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి మంత్రి నిరంజన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ....కేసీఆర్ నాయకత్వంలో 9 ఏళ్లలో ప్రగతి బాటలో తెలంగాణరాష్ట్రం నడుస్తోందని అన్నారు. సాగునీరు,తాగునీరు, 24 గంటల ఉచిత కరెంటు, వ్యవసాయ వృద్ధి, పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు పెరిగాయని, దేశానికి ఆదర్శంగా తెలంగాణ వ్యవసాయ విధానాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీరఘుపతిరెడ్డి,ప్రైవేటు ఉద్యోగుల సంఘంరాష్ట్ర అధ్యక్షులు గంధంరాములు,మండల రైతుబంధు సమితి అధ్యక్షులు రాజప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీపీ మన్యపురెడ్డి, సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ రమేష్ నాయక్, పార్టీ అధ్యక్షుడు మోహన్ బాబు,బీఆర్ఎస్ నాయకులు విట్టశివర్ధన్‌రెడ్డి, దొడగుంటపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, ధర్మారెడ్డి ఉన్నారు.

# కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా

**కల్వకుర్తి, జూలై 14 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. 1వ వార్డులోని కాలనీ వాసులు గతంలో మురుగు కాల్వ ఏర్పాటు చేయాలని ఇచ్చిన వినతి మేరకు శుక్రవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాల్వ నిర్మాణ పనులకు కౌన్సిలర్లు బాలు నాయక్, సూర్యప్రకాష్‌రావులతో కలిసి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కాలనీ వాసులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, ఏఈ శివకృష్ణ, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

# ఇల్లు స్లాబ్ పెచ్చులూడి వ్యక్తికి గాయాలు

**వెల్దండ, జూలై 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన గుర్రం రాములు వృత్తిరీత్య పనులు చేసుకొని ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో తన ఇంటి స్లాబ్ పెచ్చులూడి మీద పడటంతో కను రెప్ప, కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. గాయపడిన గుర్రం రాములు చికిత్స చేయించుకున్నాడు.

# బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన మాజీ సర్పంచ్

**వీపనగండ్ల,జూలై14,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య,కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంగల వెంకటరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేస్తున్నతరుణంలో ఆంగ్లమాధ్యమంను ప్రోత్సహిస్తున్నతెలంగాణ ప్రభుత్వం వీపనగండ్ల మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు లేకపోవడం చాలా హాస్యాస్పదమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తునుదృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిని నియమించాలని, లేనిపక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# నాగమ్మతండాలో మిల్లెట్ ఫుడ్ కాంటెస్ట్

**వనపర్తి,జూలై14,ప్రభాతవార్త:** వనపర్తి మండలం నాగమ్మతండా గ్రామంలో మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 లో భాగంగా చిరుధాన్యాల ఆధారిత సాంప్రదాయ వంటల పోటీని నిర్వహించడం జరిగింది. మదనాపురం కేవికె శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామస్థులు చిరు ధాన్యాలతో సాంప్రదాయ పద్ధతిలో వంటలు చేసివాటి ఆవశ్యతకను, ప్రస్తుత జీవన విధానంలో వాటి అవసరాన్ని చాలా చక్కగా వివరించారన్నారు. రాగి సంకటి, జొన్న సంకటి, సజ్జ సంకటి, రొట్టెలు, కొర్ర బియ్యం, బిర్యాని, రాగి గారెలు, సజ్జ గారెలు,సజ్జ పాయసం,దోసెలు మొదలైనఅద్భుతమైన వంటలు ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో మొదటి స్థానంలో నిలిచిన 6 మందికి మెమోంటో, సర్టిఫికెట్ , మిగతా వారికి కన్సోలేషన్ బహుమతులు ఇవ్వడం జరిగింది.మదనాపురం కెవికె శాస్త్రవేత్తలు కొగారే,భవానీ, అనిత,గ్రామ సర్పంచ్ మురళి, పంచాయతీ కార్యదర్శి కాశన్న,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు గోపాల్, గోవిందు, మహిళలు, పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ధర్నా

**వనపర్తి టౌన్,జూలై14,ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు, 11వ వార్డు, నాగవరం ప్రజలు ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ... వనపర్తి పట్టణ శివారులో 1167లో నల్ల చెరువు స్థలం మూడు ఎకరాల 20 గుంటల భూమి ఉందని, నాగవరం శివారు సర్వే నంబర్ 116లో 4 ఎకరాల భూమి ఉందని, వనపర్తి శివారు సర్వే నంబర్ 974లో గతంలో 360 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చారని ఎర్రజెండా పోరాట ఫలితంగా వచ్చిన ఈ పట్టాలు ఇప్పటికైనా స్థలాలు చూపి వారి ఇంటి నిర్మాణానికి డబ్బులు మంజూరు చేయాలని, అప్పాయిపల్లి శివారు సర్వేనంబర్ 143,145లో 300మందికి ఎర్రజెండా పోరాట ఫలితంగా పట్టాలిచ్చారని, కానీ స్థలాలు చూపలేదని ఆయన పేర్కొనారు.స్థలాలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజేందర్ గౌడ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ...నమ్ము చెరువు వనపర్తి శివారులో ఉన్నదని ప్రభుత్వం నుండి అనుమతి వస్తే స్థలాలు ఇస్తామని నాగవరం సర్వే నంబర్ 116 మేళ చెరవులో 4 ఎకరాల ప్రభుత్వ భూమి , ప్రభుత్వ అనుమతి తీసుకుని పేదలకు షాపులకు పోను మిగిలిన స్థలం ఇండ్ల స్థలాలు ఇస్తామని, వనపర్తి సర్వేనంబర్ 974 మబ్బుగుట్ట సదరం చేసి ఇస్తామని, అప్పాయపల్లి శివారులో 143లో లే అవుట్ వేసి, ఇండ్ల స్థలాలు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీని వీలైనంత త్వరగా పరిష్కరించాలని, అమలు చేయాలని పుట్టఆంజనేయులు డిమాండ్ చేశారు. లేనిచో ఉద్యమం ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కురుమయ్య, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరచారి, నాగవరం ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు ఉమ్మల లక్ష్మి,అంజనమ్మ, అనిత, సుజాత, జానకమ్మ, వసంత, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**వీపనగండ్ల,జూలై14,ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామన్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మీ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి ఓటిపి వచ్చిందని, మీకు లక్కీ నరడాలో డబ్బులు వచ్చాయని, ఓటిపి చెప్పండని అడుగితే చెప్పవద్దని, ఓటీపీ చెబితే మీఅకౌంట్‌లో ఉన్న డబ్బులు సైబర్ నేరగాళ్లు డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని,ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చినా ఓటీపీ చెప్పవద్దని ఆయన తెలిపారు. బ్యాంకు అధికారులు ఎవరూ కూడా ఓటీపీ చెప్పమని అడగరని , మీరుఎలాంటి ఓటీపీ ఎవరికి చెప్పకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.